సాక్షి
వికారాబాద్

మంగళవారం । 5 । నవంబర్ । 2024



పంట రక్షణకు..

అడవి జంతువుల నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు ఆధునిక పద్ధతులు పాటిస్తున్నారు. 8లో▸



వేతనాలు చెల్లించాలి

అంగన్‌వాడీ టీచర్లకు పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. 8లో▸



నిధులు లేక..

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన సమీకృత మార్కెట్ సముదాయ భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. 9లో▸

ధాన్యం సేకరణకు సన్నద్ధం



ధాన్యం కొనుగోలుపై సమీక్ష చేస్తున్న అధికారులు(ఫైల్)

ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం

- జిల్లాలో మొత్తం కొనుగోలు కేంద్రాలు 126
- సన్నరకం వడ్ల కోసం 18 సెంటర్లు
- లక్ష్యం 1.0.5000 మెట్రిక్ టన్నులు

వికారాబాద్: వానాకాలం సీజన్(2024–25)కు సంబంధించి పంట చేతికొస్తుండటంతో అధికారులు ధాన్యం సేకరించేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. గడిచిన రెండు రోజుల్లో 15 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా ఈ వారంలో మరో 111 సెంటర్లను ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు. గత సీజన్‌తో పోలిస్తే ఈ ఏడాది రికార్డు స్థాయిలో వరి పంట సాగయ్యింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది 100 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించగా ఈ సారి అదనంగా మరో 26 కేంద్రాలను పెంచారు. సన్న రకం వడ్ల కొనుగోలుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు.

మద్దతు ధర రూ.2,320

కేంద్ర ప్రభుత్వం క్వింటాలు ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,300 మద్దతు ధర ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఇదే మొత్తంతో తాము కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. క్వింటాలు ఏ గ్రేడ్ రకానికి రూ.2,320, బీ గ్రేడ్‌కు రూ.2,300 చెల్లించాలని నిర్ణయించారు. ఎకరాకు సగటున 22 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ లెక్కన 2.8లక్షల మెట్రిక్ టన్నులు రావచ్చని ఆ శాఖ అధికారులు తెలిపారు. అయితే 1,05,000 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయాలని నిర్ణయించారు. శనివారం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ధాన్యం సేకరణపై సమావేశం ఏర్పాటు చేసి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

మూడు ఏజెన్సీలకు బాధ్యతలు

జిల్లా వ్యాప్తంగా మూడు ఏజెన్సీల ద్వారా ధాన్యం సేకరించాలని నిర్ణయించారు. ఐకేపీ ఆధ్వర్యంలో 34 కేంద్రాలు, డీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో 31, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 61 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. సేకరించిన ధాన్యాన్ని 70 మిల్లులకు తరలించి మిల్లింగ్ ప్రక్రియ చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. వడ్లు నిల్వ చేసేందుకు ఇప్పటికే స్థలాలు, మిల్లులను గుర్తించారు.

సన్నరకానికి ప్రత్యేక కేంద్రాలు

క్వింటాలు సన్నరకం వడ్లకు రూ. 500ల బోనస్ ఇవ్వనుండటంతో అధికారులు అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం 18 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత సీజన్‌లో 30 వేల ఎకరాల్లో సన్నరకం వరి పంట సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. సన్నరకం వడ్లు ఎక్కువగా సాగవుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

తేమ లేకుండా తేవాలి



ధాన్యం సేకరణకు పక్కా ఏర్పాట్లు చేస్తున్నాం. గత సీజన్‌లో తాలు తరుగు, తేమ, మట్టి పెల్లల శాతం ఎంత ఉంటే కొనుగోలు చేయాలి అనే దానిపై కేంద్రాల నిర్వాహకులకు అవగాహన లేక ఇబ్బంది పడ్డాం. అందుకే ఈ సారి పూర్తిస్థాయి అవగాహన కల్పించాం. రైతులు తాలు లేకుండా, బాగా ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాలి. ఇలా చేస్తే ఎవరికీ ఇబ్బంది ఉండదు. పక్క రాష్ట్రాల నుంచి మన రాష్ట్రానికి ధాన్యం రాకుండా సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేస్తాం.

– లింగ్యానాయక్, అడిషనల్ కలెక్టర్

గ్రూప్ –3కి ఏర్పాట్లు చేయండి

అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: గ్రూప్ – 3 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గ్రూప్ –3 పరీక్ష నిర్వహణపై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధికారులు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 17, 18 తేదీల్లో జరగనున్న గ్రూప్–3 పరీక్షలకు జిల్లాలో 31 కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. వికారాబాద్‌లో 20, తాండూరులో 11 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. 10,196 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలు సజావుగా జరగడానికి ఇన్విజిలేటర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించాలని సూచించారు. పరీక్ష పత్రాలు కేంద్రాలకు తీసుకెళ్లడానికి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలోని పరీక్ష పత్రాలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ను అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. సమావేశంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ నరేంద్రకుమార్, అసిస్టెంట్ రీజినల్ కోఆర్డినేటర్లు అరవింద్ రెడ్డి, కలెక్టరేట్ ఏఓ ఫరీనా ఖాతున్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నేమత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో తప్పులు దొర్లద్దు

ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో తప్పులు దొర్లకుండా వివరాలు నమోదు చేయాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) సుధీర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్వేపై వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఉపాధ్యాయులకు మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల అమలుకు ఈ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సర్వేలో చేపట్టాల్సిన అంశాలపై ఎన్యూమరేటర్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఇంటి యజమాని తెలిపిన వివరాలను మాత్రమే తీసుకోవాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

పక్కాగా కుటుంబ సర్వే చేయాలి

కొడంగల్: మండలంలో చేపట్టబోయే ఇంటింటి కుటుంబ సర్వేపై ఎన్యూమరేటర్లకు, సూపర్‌వైజర్లకు సోమవారం అవగాహన కల్పించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మున్సిపల్, మండల సర్వే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ విజయకుమార్, ఎంపీడీఓ ఉషశ్రీ, ఎంఈఓ రాంరెడ్డి సర్వే సిబ్బందికి సలహాలు సూచనలు ఇచ్చారు. సర్వేను సమగ్రంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించే క్రమంలో భాగంగా ప్రభుత్వం కుటుంబ సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నిర్దేశిత నమూనాలో తప్పులు లేకుండా వివరాలు పొందుపర్చాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే అధికారులను సంప్రదించాలన్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ అంశాలను వివరంగా తీసుకోవాలన్నారు. పారదర్శకంగా జవాబుదారీగా అన్ని అంశాలను నమోదు చేయాలన్నారు. తప్పిదాలకు తావులేకుండా చూడాలన్నారు.



ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇస్తున్న అధికారులు



మాట్లాడుతున్న నిర్మల

11నుంచి జోనల్ స్పోర్ట్స్ మీట్

అనంతగిరి: వికారాబాద్ పట్టణం బుగ్గ రోడ్డులోని శివారెడ్డిపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఈ నెల 11నుంచి 14వ తేదీ వరకు 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు జోనల్ ఆఫీసర్ నిర్మల తెలిపారు. సోమవారం పాఠశాలలో నిర్వహణ కమిటీతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ పోటీల్లో గురుకుల పాఠశాల జోనల్ పరిధిలోని ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడులు

- 73 మంది అరెస్ట్
- రూ.1,98,789ల నగదు, 55 సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నారాయణరెడ్డి



ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: జిల్లా వ్యాప్తంగా సోమవారం పేకాట స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ నారాయణరెడ్డి వెల్లడించారు. వికారాబాద్‌లోని బీజేఆర్ చౌరస్తాలో ఓ వ్యక్తిని అరెస్టు చేసి 500 గ్రాముల గంజాయిని సీజ్ చేశారు. అలాగే పట్టణంలో రెండు పేకాట స్థావరాలపై దాడులు చేసి 18మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.19,530 నగదు, తొమ్మిది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. చెంగోముల్ పీఎస్ పరిధిలోని బాకాపూర్‌లో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి రూ.10,540 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కొడంగల్, కొండారెడ్డిపల్లి, కస్తూరిపల్లి గ్రామాల్లో దాడులు చేసి 24మందిని అదుపులోకి తీసుకొని రూ.31,800 నగదు, 19 ఫోన్‌లు సీజ్ చేశారు. దౌల్తాబాద్‌లో 8మందిని అదుపులోకి తీసుకుని రూ.13,930 నగదు, ఐదు ఫోన్లు సీజ్ చేశారు. బొంరాస్‌పేట పీఎస్ పరిధిలోని 8 మందిని అదుపులోకి తీసుకుని రూ.14,670 నగదు, ఏడు సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. తాండూరు పీఎస్ పరిధిలోని ఏడుగురిని అరెస్టు చేసి రూ.80,270 నగదు, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం తొమ్మిది కేసులు నమోదు చేసి 73మందిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. పేకాట స్థావరాల వివరాలు తెలిస్తే టాస్క్‌ఫోర్స్ సీఐ సెల్ నంబర్ 8712670022కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

న్యూస్‌రీల్

హస్నాబాద్‌లో సినీనటుల సందడి



గ్రామస్తులతో దర్శకుడు బోయపాటి శ్రీనివాస్, నటుడు ప్రభాకర్

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్‌లో సోమవారం సినీ నటులు సందడి చేశారు. బాహుబలి చిత్రంలో కాలకేయ పాత్రలో నటించిన ప్రభాకర్ సొంత గ్రామం హస్నాబాద్ కావడంతో ఆయన అక్కడ నూతన గృహం నిర్మించారు. గృహ ప్రవేశం సందర్భంగా ప్రముఖ డైరెక్టర్ బోయపాటి శ్రీనివాస్, నటుడు దిల్ రమేశ్ హాజరయ్యారు. వీరిని చూడడానికి అభిమానులు, గ్రామస్తులు పోటీపడ్డారు. ఫొటోలు దిగేందుకు ఎగబడ్డారు. గ్రామస్తులు, అభిమానులతో వారు కాసేపు ముచ్చటించారు. భోజన అనంతరం హైదరాబాద్‌కు వెళ్లారు.

మట్టి నమూనాల సేకరణ



డ్రిల్లింగ్ చేసి మట్టి నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

దుద్యాల్: కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ శివారులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమీకృత గురుకుల భవన నిర్మాణ పనుల్లో భాగంగా సోమవారం మట్టి నమూనాలు సేకరించారు. జియో టెక్నికల్ కంపెనీ సూపర్‌వైజర్ సురేశ్ ఆధ్వర్యంలో మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పునాదులు ఎంత లోతు మేర తీస్తే భవనం పటిష్టంగా ఉంటుందో తెలుసుకునేందుకు ఈ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. సేకరించిన మట్టిని ల్యాబ్‌కు పంపించి రిపోర్టులు ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.

ప్రజావాణికి 132 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖలకు బదిలీ చేసి సత్వరం పరిష్కరించాలని సూచించారు. పరిష్కారం కాని సమస్యలు ఉంటే అందుకు గల కారణాలను అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్, ఆర్డీఓ వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐఎస్‌ఓ సర్టిఫికెట్



ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌తో కళాశాల సిబ్బంది

కొడంగల్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐఎస్‌ఓ సర్టిఫికెట్ లభించడంతో సోమవారం అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. ఐఎస్‌ఓ 9001 క్వాలిటీ 14001–గ్రీన్, 50001ఎనర్జీ అంశాల్లో ప్రత్యేక గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపాల్ రఫియాఖానం తెలిపారు. గతేడాది ఫిబ్రవరిలో న్యాక్ సర్టిఫికెట్, ఈ ఏడాది ఐఎస్‌ఓ గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాంబాబు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కులగణన సదస్సును జయప్రదం చేయండి

మహేశ్వరం: హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించనున్న కులగణన సంప్రదింపుల సదస్సును విజయవంతం చేయాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సదస్సుకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరుకానున్నారని, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఇలా చదివితే.. నవోదయమే!

- తడబాటు వద్దు.. లక్ష్యమే ముద్దు
- ప్రణాళిక, పట్టుదల ఉంటే పేద విద్యార్థులకు సీటు ఖాయం
- జనవరి 18న ప్రవేశ పరీక్ష

బొంరాస్‌పేట: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పునాదులు జవహర్ నవోదయ విద్యాలయాలు. ఒత్తిడిలేని చదువు.. ఆటపాటలతో మానసికోల్లాం.. విద్యావికాసానికి కేంద్రాలు నవోదయ విద్యాలయాలు. ఈ విద్యాలయంలో ప్రవేశం కోసం వేలాది మంది విద్యార్థులు ఎంతో ఆసక్తి చూపుతారు. చిన్న వయస్సులోనే ప్రవేశ పరీక్షలో పోటీపడి విజయం సాధిస్తారు. విజేతలుగా నిలుస్తారు. ఎందరికో ఆదర్శం అవుతారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం

ఆరవ తరగతిలో ప్రవేశం తీసుకున్నప్పటి నుంచి ఇంటర్ వరకు అన్ని వసతులతో విద్యనందిస్తారు. ఎందరో డాక్టర్లు, పోలీసు అధికారులు, సాంకేతిక నిపుణులను అందించిన ఘనత జవహర్ నవోదయ విద్యాలయాలకు ఉంది. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసి బంగారు భవిష్యత్‌కు మార్గం చూపుతున్నాయి. దేశంలోనే ఈ విద్యా సంస్థలకు ప్రత్యేక గుర్తింపు ఉంది.

ఎంపిక ఇలా..

నవోదయలో ప్రవేశానికి 6వ తరగతి నుంచి పరీక్షలు నిర్వహిస్తారు. ప్రభుత్వ, ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రతియేటా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో విద్యాలయంలో 80 సీట్లు ఉంటాయి. అందులో 75శాతం సీట్లు గ్రామీణ విద్యార్థులకు, 25శాతం పట్టణ విద్యార్థులకు అవకాశం ఉంటుంది. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన విద్యార్థుల ప్రగతికి ఎంతగానో దోహదం చేస్తుంది.

మూడు విభాగాల్లో పరీక్ష

నవోదయ ఎంట్రెన్స్ టెస్ట్‌లో ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ రూపంలోనే ఉంటాయి. సమాధానాలు ఇంటలిజెన్స్ క్యారెక్టర్ రికగ్నిషన్ (ఐసీఆర్), ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నిషన్ (ఓసీఆర్) షీట్లలో అంకెల రూపంలో గుర్తించాల్సి ఉంటుంది. విరామం లేకుండా మొత్తం రెండు గంటల వ్యవధిలో 100 మార్కులకు మూడు విభాగాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ఒక్కో ప్రశ్నకు 1.25 మార్కు ఉంటుంది. తెలుగు లేదా ఆంగ్ల భాషలో నాలుగు పాసేజీలు ఉంటాయి. మేధాశక్తి (మెంటల్ ఎబిలిటీ) 60 నిమిషాల పరీక్షకు 50 మార్కులకు గాను 40 ప్రశ్నలు ఉంటాయి. 30 నిమిషాల గణితం 20 ప్రశ్నలకు 25 మార్కులు, 30 నిమిషాల భాషా నైపుణ్యం పరీక్షలో 20 ప్రశ్నలకు గానూ 25 మార్కులు సాధించాల్సి ఉంటుంది. మేధాశక్తి విభాగంలో అధిక మార్కులు ఉంటాయి. బొమ్మల రూపం ప్రశ్నల్లో సులభంగా, ఒత్తిడికి గురికాకుండా సమయ స్ఫూర్తితో ఆలోచించాల్సి ఉంటుంది. పాత ప్రశ్నపత్రాలను పరిశీలించడం ద్వారా ఎక్కువ మార్కులు పొందే అవకాశం ఉంటుంది. గణితం కూడా కీలకమే. గణితంలో ఎక్కువ మార్కులు పొందేవారికి సీటు ఖాయమని చెప్పవచ్చు. ఐదో తరగతి వరకు అన్ని చాప్టర్లలో ఒకటి లేదా రెండు ప్రశ్నలు అడుగుతారు.

తడబాటు తొలగించేలా..

- నవోదయ ప్రవేశ పరీక్షకు సిద్ధమయ్యే విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.
- పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రానికి చేరుకోవాలి. ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించరు.
- ఒక్క ప్రశ్నకు నిమిషం సమయం పడుతుంది. సమయం ఆదా కావడానికి సులభంగా సమాధానం దొరకని ప్రశ్నను వదిలి మరో ప్రశ్నకు జవాబు రాయాలి.
- సమాధానాలు గుర్తించడానికి నీలి లేదా నలుపు బాల్ పెన్ను మాత్రమే వాడాలి.
- రఫ్ వర్క్ చేయాల్సి వస్తే బుక్‌లెట్‌లోని 16వ పేజీని మాత్రమే వినియోగించుకోవాలి.
- ఒక్కసారి సమాధానం రాసిన తర్వాత దిద్దడం, కొట్టివేయడం చేయరాదు.
- బుక్‌లెట్‌లోని మూడు విభాగాల్లో ఉత్తీర్ణులు కావాల్సిందే.
- ప్రతి 30 నిమిషాలకు ఒకసారి గంట కొడతారు. అది గమనించి పరీక్ష రాయాలి.



విద్యార్థులను నవోదయ ప్రవేశ పరీక్షకు సిద్ధం చేస్తున్న క్రాంతికుమార్

జనవరి 18న ప్రవేశ పరీక్ష

నవోదయ పాఠశాలల్లో ప్రవేశానికి ఇంకా రెండు నెలల సమయం ఉంది. వచ్చే ఏడాది జనవరి 18న శనివారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30గంట వరకు ప్రవేశ పరీక్ష ఉంటుంది. పరీక్షకు వెళ్లేటప్పుడు హాల్ టికెట్, ప్యాడ్, నీలం, నలుపు రంగు బాల్ పెన్నులు తీసుకెళ్లాలి. ఓఎంఆర్ షీట్‌లో విద్యార్థి వివరాలు ఉంటాయి. ప్రశ్నాపత్రంలో అన్ని పేజీలు ప్రింట్, క్రమసంఖ్య, మీడియం సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవాలి.

నవోదయతోనే నాకు లైఫ్



నేను 2009లో వట్టిం నవోదయలో ఆరో తరగతి ప్రవేశం పొందా. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ విద్యాలయాలు ఉన్నతమైన జీవితాన్ని ఇస్తాయి. ఇందులో కేర్ టేకర్‌ను ఉంచడం, దత్తత తీసుకోవడం, కల్చరల్, క్రీడలు, పోటీతత్వం పెంచుతాయి. ప్రత్యేక ఉపాధ్యాయులే అమ్మానాన్నలుగా ఉంటారు. పాఠ్యపుస్తకాల పరిజ్ఞానం ఎక్కువగా ఉంటుంది. నవోదయనే నా ఉన్నత విద్యకు లైఫ్ ఇచ్చింది.

– ఎఫ్ ప్రశాంత్, నవోదయ పూర్వ విద్యార్థి, రేగడిమైలారం

కొడంగల్ నుంచే తక్కువ



నవోదయ విద్యాలయాల్లో కొడంగల్ ప్రాంత విద్యార్థుల ప్రవేశం చాలా తక్కువగా ఉంటుంది. ఇక్కడ కోచింగ్ సెంటర్లు లేకపోవడం, తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడమే ఇందుకు కారణం. నేను కొడంగల్ మండలం హుస్సేన్‌పూర్ హెచ్‌ఎం ఇల్లూరి క్రాంతి కుమార్ వద్ద కోచింగ్ తీసుకున్నా. వట్టిం నవోదయలో సీటు వచ్చింది. ఈ విద్యాలయం సొంత ఇల్లులా ఉంటుంది.

– నీలి లిఖిత, నవోదయ, 9వ తరగతి

స్టడీ బాగుంటుంది



నవోదయలో బట్టీ విధానం ఉండదు. అన్ని విషయాలను రాసేలా సిద్ధం చేస్తారు. గ్రూపులు ఏర్పాటు చేసి భయాన్ని తొలగిస్తారు. సొంతంగా ఆలోచించడం నేర్పుతారు. తోటి విద్యార్థులతో సోదరభావం పెరుగుతుంది. తొమ్మిదో తరగతిలో మైగ్రేషన్ ఉంటుంది. దీని వల్ల రాజస్థాన్, హర్యానా తోపాటు ఇతర రాష్ట్రాల సంప్రదాయాలు తెలుస్తాయి. భాషా పరిజ్ఞానం పెరుగుతుంది.

– కే రుచిత, 8వ తరగతి, వట్టిం నవోదయ

గ్రామీణ విద్యార్థుల్లో ప్రతిభ ఉంది



రెండు దశాబ్దాలకు పైగా పిల్లలను నవోదయ ప్రవేశ పరీక్షకు సిద్ధం చేస్తున్నా. చాలా మంది సీట్లు సాధిస్తున్నారు. ఉద్యోగుల పిల్లలే కాదు, పేద, రైతు కుటుంబాల విద్యార్థులు సైతం సుమారు 30మందికి పైగా సీట్లు పొందారు. కొందరు ఉన్నతస్థాయిలో ఉన్నారు. నాకు చాలా గర్వంగా ఉంది. భవిష్యత్తులో కూడా విద్యార్థులను పరీక్షకు సిద్ధం చేస్తా.

– క్రాంతి కుమార్, హెచ్‌ఎం, హుస్సేన్‌పూర్

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి పూర్తి సహకారం
మండలి చీఫ్‌ విప్‌ మహేందర్‌రెడ్డి


తండా వాసులతో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

పెద్దేముల్‌: సేవాలాల్‌ మహరాజ్‌ ఆలయ నిర్మాణానికి పూర్తి సహకారం ఉంటుందని మండలి చీఫ్‌ విప్‌ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని ఓంలానాయక్‌ తండాలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సేవాలాల్‌ మహరాజ్‌ ఆలయాలు నిర్మించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని సూచించారు. ఆయన వెంట మాజీ సరంచ్‌ గెమ్యా నాయక్‌, రుక్కిబాయి, రమి చౌహాన్‌ తదితరులు ఉన్నారు.

మహిళల భద్రతకే షీ టీమ్స్‌
దోమ: మహిళల భద్రత కోసమే షీ టీమ్స్‌ పని చేస్తున్నాయని కాంప్లెక్స్‌ ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్‌ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కిష్టాపూర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌లో షీ టీమ్‌ ఇన్‌చార్జి నర్సింహులు విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆకతాయిలు వేధింపులకు గురిచేస్తే డయల్‌ 100కు కాల్‌ చేయాలని సూచించారు. మహిళలపై ఎలాంటి దాడులు జరిగిన 181కు కాల్‌ చేయాలన్నారు. గంజాయి నిర్మూలన, డ్రగ్స్‌ వినియోగాన్ని నిషేధించాలన్నారు. సైబర్‌ క్రైమ్‌లో ఎలాంటి మోసాలు జరిగిన 1930కి కాల్‌ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, షీటీం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు పేదలకు చేరవేయండి
ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ వెన్న ఈశ్వరప్ప

దోమ: కేంద్ర ప్రభుత్వ పథకాలు పేదలకు అందేలా కార్యకర్తలు కృషి చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ వెన్న ఈశ్వరప్ప అన్నారు. సోమవారం మండల పరిధిలోని మోత్కూర్‌, దాదాపూర్‌ గ్రామాలలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కార్యకర్తలు ముందుకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి భానుప్రకాశ్‌, మండల అధ్యక్షుడు అనంతయ్య, ప్రధాన కార్యదర్శి మహేశ్‌, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు గోవర్ధన్‌, నేతలు నర్సింహులు, చంద్రలింగం, తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన రోజున కుళ్లిన కేక్‌
మున్సిపల్‌ కమిషనర్‌కు బాధితుల ఫిర్యాదు

పరిగి: కుళ్లిపోయిన కేక్‌ విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం మున్సిపల్‌ కమిషనర్‌ వెంకటయ్యకు బాధితులు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా.. పట్టణ కేంద్రంలోని అయ్యప్ప కాలనీలో నివాసం ఉంటున్న రాజు ఈ నెల 3న తన కూతురు పుట్టిన రోజు సందర్భంగా బస్టాండ్‌ ఎదురుగా ఉన్న గోల్డెన్‌ బేకరీలో కేక్‌ కొనుగోలు చేసి తీసుకెళ్లాడు. కేక్‌ కట్‌ చేసిన తర్వాత ఎనిమిది మంది తిన్నారు. దుర్వాసన రావడంతో వారు బేకరీ నిర్వాహకులను ప్రశ్నించగా ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. దీంతో వారు పోలీసులకు, మున్సిపల్‌ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కుళ్లిన కేక్‌లు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుదాఘాతంలో మేక మృతి


మేక కళేబరం

తాండూరు రూరల్‌: విద్యుదాఘాతంతో మేక మృత్యువాత పడింది. ఈ ఘటన మండల పరిధిలోని సంగెంకలాన్‌ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన చాకలి జగ్గప్ప పశుపోషణతో జీవనం సాగిస్తున్నాడు. రోజుమాదిరిగానే మేకలను మేతకు తీసుకెళ్లగా గ్రామ శివారులోని ఎయిర్‌టెల్‌ సెల్‌ టవర్‌ వద్ద విద్యుత్‌ వైర్లు తగిలి మేక అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్‌ సిబ్బంది నిర్లక్ష్య ం కారణంగానే మేక మృతి చెందిందని బాధితుడు జగ్గప్ప విద్యుత్‌ ఏఈకి ఫిర్యాదు చేశాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరాడు.

పంట రక్షణకు సోలార్‌ ఫెన్సింగ్‌

- తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం
- పంటలకు తగ్గిన వన్యప్రాణుల బెడద
- ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలని కోరుతున్న రైతులు


వేరుశనగ పంటకు ఏర్పాటు చేసిన సోలార్‌ ఫెన్సింగ్‌

దుద్యాల్‌: పంటలు కాపాడుకునేందుకు గతంలో రైతులు పగలు, రాత్రి తేడా లేకుండా ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం ప్రాణహాని లేని ఆధునిక విధానాల వైపు ఆసక్తి చూపుతున్నారు. పంటల నుంచి అటవీ జంతువుల నుంచిన కాపాడుకునేందుకు సోలార్‌ ఫెన్సింగ్‌ ఏర్పాటు చేసుకుంటున్నారు.

పది ఎకరాలకు రూ.15వేల ఖర్చు

సోలార్‌ కంచెను వన్య ప్రాణులు, పశువులు తాకినప్పటికీ ప్రాణహాని ఉండదు. సోలార్‌తో వచ్చే షాక్‌తో అవి భయపడి దూరంగా వెళ్లిపోతాయి. కుదురుమల్ల, లగచెర్ల, హకీంపేట, పోలేపల్లి, హస్నాబాద్‌, చిలుముల మైల్వార్‌, చెట్టుపల్లి తండా, హసంపల్లి గ్రామాలతో పాటు గిరిజన తండాలలో అటవీ సమీప శివారు భూముల్లో పంటలు సాగు చేస్తున్నారు. పంటలకు అడవి పందులు, మేకలు, పశువుల బెడద ఎక్కువగా ఉంటోంది. దీంతో మొక్క జొన్న, వేరుశనగ తదితర పంటలను కాపాడుకునేందుకు సోలార్‌ కంచెలను ఏర్పాటు చేసుకుంటున్నారు. పది ఎకరాలకు సోలార్‌ ఫెన్సింగ్‌ వేసేందుకు రూ.12 నుంచి రూ.15వేల వరకు ఖర్చు వస్తుంది. సమీప రైతులు కలిసి ఏర్పాటు చేసుకుంటే ఖర్చు మరింత తగ్గుతుందని రైతులు వెల్లడిస్తున్నారు. ఒకసారి ఏర్పాటు చేసుకుంటే ఏళ్ల తరబడి మేలు చేకూరుతోందని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

రూ.8 వేలు ఖర్చు అయింది



పొలం చుట్టూ సోర కంచె ఏర్పాటు చేయడంతో పంటకు పశువుల, వన్యప్రాణుల బెడద తప్పింది. సాధారణంగా ఇనుప కంచె ఏర్పాటు చేసుకుంటే రూ.లక్ష ఖర్చు అవుతుంది. సోలార్‌ ఫెన్సింగ్‌ వేసుకుంటే ఎనిమిది వేల ఖర్చుతో పూర్తయింది. ప్రస్తుతం పంట రక్షణకు ఢోకాలేదు. – రాములు, రైతు, హకీంపేట్‌

తక్కువ ఖర్చుతో పంట రక్షణ



పంటలకు సోలార్‌ కంచె ఏర్పాటు చేయడంతో తక్కువ ఖర్చుతో పంటలను రక్షించుకోవచ్చు. ఇప్పటికే కొంత మంది రైతులు సత్ఫాలితాలు సాధిస్తున్నారు. ఈ కంచెతో ఇటు పంట రక్షణతో పాటు వన్య ప్రాణులకు ఎలాంటి హాని ఉండదు. ఈ మేరకు రైతుల్లో అవగాహన పెంపొందిస్తాం. – తులసి, ఏఓ

సబ్సిడీ ఇస్తే మేలు

ప్రభుత్వం రాయితీపై సోలార్‌ ఏర్పాటుకు సహకరిస్తే రైతులకు మేలు చేకూరుతుంది. సోలార్‌ ఫెన్సింగ్‌కు ప్రభుత్వం చొరవ 80శాతం నుంచి 90 శాతం వరకు సబ్సిడీ ఇస్తే రైతులు ఆసక్తి చూపుతారు.


కుదురుమల్లలో పర్యటిస్తున్న కడా అధికారి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్‌ నాయకులు

గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు

కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

దుద్యాల్‌: గ్రామ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని కుదురుమల్ల గ్రామంలో పర్యటించారు. ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామానికి అవసమరైన మౌలిక వసతులు గుర్తించి వెంటనే నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైనేజీ, పాఠశాల, పంచాయతీ భవనాల నిర్మాణం అవసరమని గ్రామస్తులు వెంకట్‌రెడ్డికి వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు శేఖర్‌, మాజీ సర్పంచ్‌ రఘుపతి, కాంగ్రెస్‌ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటడం హర్షణీయం

కొడంగల్‌ రూరల్‌ : పట్టణంలోని జిల్లా పరిషత్‌ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి వీరేశంతోపాటు పాఠశాల పీడీ అజీజ్‌ను సోమవారం పాఠశాల ఆవరణలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ రాజేశ్‌ రెడ్డి, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్‌ కుమార్‌ సన్మానించారు. ఇటీవల స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్‌ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో రన్నరప్‌గా నిలిచిన రంగారెడ్డి జిల్లా జట్టులో విద్యార్థి వీరేశం ఆడాడని పాఠశాల సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రాంరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం మురళీధర్‌, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు సీఎం చొరవ


పరిగి: గురుకుల సిబ్బంది, విద్యార్థులు నిర్వహించిన సంబురాల్లో కేక్‌ కట్‌ చేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

- డైట్‌, కాస్మోటిక్‌ చార్జీల పెంపు హర్షణీయం
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: విద్యార్థుల భవిష్యత్‌ కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌ రెడ్డి అన్నారు. వసతి గృహ విద్యార్థులకు డైట్‌, కాస్మోటిక్‌ చార్జీలు పెంచడంతో సోమవారం పట్టణ కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో కేక్‌ కట్‌ చేసి సంబురాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏడేళ్లుగా డైట్‌ చార్జీలు పెంచలేదన్నారు. 16 ఏళ్లుగా కాస్మోటిక్‌ చార్జీలు పెంచలేదన్నారు. ఇక నుంచి హాస్టల్‌ విద్యార్థులకు ఆకలితో ఇబ్బంది పడొద్దన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పదేళ్లుగా విద్యార్థుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. ఏడాది కాలంలోనే సమస్యలను గుర్తించిన ముఖ్యమంత్రి ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నారన్నారు. పరిగిలో ఉన్న గురుకులాల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. సొంత భవనాలను నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువస్తామన్నారు. సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంత్‌ ముదిరాజ్‌, ప్రిన్సిపాల్‌ శాలిని, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, అన్వర్‌, యూనుస్‌ తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

పూడూరు: పత్తి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని సాయిబాబా కాటన్‌మిల్‌, రాకంచర్ల కాటన్‌మిట్‌, ధరణి కాటన్‌ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం నేరుగా రైతులు పండించిన పంటలను కొనుగోలు చేస్తోందన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను, మిల్లు యాజమానులను కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్‌ చైర్మన్‌ సతీశ్‌ రెడ్డి, డీసీసీ కార్యదర్శులు పెంటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌, పరిగి, పార్టీ పూడూరు మండల అధ్యక్షులు పరశురాంరెడ్డి, సురేందర్‌, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌, అబ్బాస్‌, అబ్రహం, గోవర్ధన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తూకాల్లో మోసం సహించం

- రైతు సంక్షేమమే కాంగ్రెస్‌ ధ్యేయం
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్‌: తూకాల్లో మోసం సహించమని.. 41 కేజీలకు మించి తూకం వేస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి రైతులకు సూచించారు. సోమవారం ఆయన మండల పరిధిలోనలి మారేపల్లిలో సీసీఐ పత్తి, మంబాపూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. గతేడాది 41 కిలో బదులు 43 నుంచి 44 కిలో వరకు ధాన్యం తూకాలు చేశారని.. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన అరకిలో ఎక్కువ తూకం చేసినా తమకు ఫిర్యాదు చేయాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం సన్నాలకు ప్రభుత్వం రూ.500లు బోనస్‌ ఇస్తుందన్నారు. పత్తి కొనుగోలుల్లో దళారుల ప్రమేయం లేకుండా చూడాలని కోటపల్లి వ్యవసాయ మార్కెట్‌ సీఈఓ లక్ష్మయ్యకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధారాసింగ్‌, కోటపల్లి ఏఎంసీ చైర్మన్‌ అంజయ్య, వైస్‌ చైర్మన్‌ నారాయణరెడ్డి, డీసీఎంఎస్‌ మేనేజర్‌ ఎల్లయ్య, సీఈఓ లక్ష్మణ్‌, మహిళా కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, తట్టేపల్లి పీఏసీఎస్‌ డైరెక్టర్‌ మల్లేశం, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌, నాయకులు మైపాల్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, ఇందూరు ప్రకాశం, రియాజ్‌, మైపూస్‌, విద్యాసాగర్‌ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

యాలాల: ప్రభుత్వ మద్దతు ధరతో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని రాస్నం, పగిడియాల, యాలాల, బెన్నూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ మద్దతు ధరతో పీఏసీఎస్‌, డీసీఎంఎస్‌, ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్‌ బాల్‌రెడ్డి, సొసైటీ చైర్మన్‌ సురేందర్‌ రెడ్డి, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పురుషోత్తంరావు, శ్రీనివాస్‌, బీసీ సెల్‌ మండల అధ్యక్షుడు అమృతప్ప, ఏఎంసీ డైరెక్టర్లు రాజు, నర్సింహులుగౌడ్‌, మొగులప్ప, మాజీ సర్పంచ్‌ హన్మంత్‌, నాయకులు మహిపాల్‌, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు సలాం పాష ఉన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

యాలాల: మండలంలోని బాగాయిపల్లి–కమాల్‌పూర్‌ వరకు చేపడుతున్న రోడ్డు వెడల్పు పనులను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు తొలగనున్నాయన్నారు.


పెద్దేముల్‌: మారేపల్లిలో పత్తి కొనుగోలు కేంద్రం వద్ద ట్రాక్టర్‌ నడుపుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పనుల్లో వేగం పెంచి నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

చివరి గింజ వరకూ కొనుగోలు

బషీరాబాద్‌: రైతులు పండించిన వరిధాన్యం చివరి గింజ వరకూ ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే మనోహర్‌ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలం పరిధిలోని కాశీంపూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభించి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం రైతుల పక్షపతిగా పనిచేస్తుందని అన్నారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ మాధవ్‌రెడ్డి, సొసైటీ వైస్‌ చైర్మన్‌ అజయ్‌ప్రసాద్‌, నాయకులు రామునాయక్‌, శంకరప్ప, అశోక్‌గౌతం, శంకర్‌రెడ్డి, బిచ్చిరెడ్డి, వెంకటయ్య, నర్సప్ప, కలాల్‌ చందు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సొసైటీల ఏర్పాటుకు ప్రతిపాదనలు

డిస్ట్రిక్ట్‌ కోఆపరేటివ్‌ ఆఫీసర్‌ సర్క్యులర్‌

- ధారూరు పీఏసీఎస్‌ సంఘం అత్యవసర సమావేశం
- ఏడింటి ఏర్పాటుకు తీర్మానం

ధారూరు: రైతులకు విస్తృత సేవలు అందించడానికి కృషి చేస్తున్న పీఏసీఎస్‌లను పునర్వ్యవస్థీకరించి అవసరమైన చోట కొత్త సహకార సంఘాలను ఏర్పాటు చేయడానికి డిస్ట్రిక్ట్‌ కోఆపరేటివ్‌ ఆఫీసర్‌ ప్రతిపాదనలు పంపించాలని సర్క్యులర్‌ జారీ చేశారని ధారూరు పీఏసీఎస్‌ సంఘం చైర్మన్‌ సత్యనారాయణరెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ధారూరు పీఏసీఎస్‌ సంఘంలో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి గతంలో ఉన్న పాత సొసైటీల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని సూచించినట్లు తెలిపారు. గతంలో ధారూరు పీఏసీఎస్‌ సంఘంలో విలీనమైన నాగసమందర్‌, తరిగోపుల, గురుదోట్ల, నాగారం, కేరెళ్లి, కుక్కింద సొసైటీలను తిరిగి కొనసాగించాలని పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. ధారూరు మండలం నుంచి వికారాబాద్‌ మండలంలో విలీనమైన గోదంగుడ, జైదుపల్లి, సర్పన్‌పల్లి గ్రామాలను కలిపి ప్రత్యేక సొసైటీ ఏర్పాటు చేయాలని డైరెక్టర్‌ శివకుమార్‌ ప్రతిపాదించగా సభ్యులు ఆమోదించారు. కొత్త సొసైటీలు కావాల్సిన గ్రామాలుంటే వినతులు ఇవ్వవచ్చని, వాటిని సైతం ప్రతిపాదిస్తామన్నారు. తీర్మానించిన ప్రతిపాదనలను సొసైటీ ద్వారా డిస్ట్రిక్‌ కోఆపరేటివ్‌ ఆఫీసర్‌కు పంపించారు. సుదీర్ఘంగా జరిగిన అత్యవసర సమావేశంలో సొసైటీ చైర్మన్లకు సైతం రిజర్వేషన్‌ వర్తింపజేయాలని సమావేశం సూచించింది. సొసైటీ డైరెక్టర్లకు ప్రొటోకాల్‌ వర్తింపజేయాలని డైరెక్టర్లు సూచించారు. అసైన్డ్‌ భూములు, లావని పట్టాలున్న రైతులకు సొసైటీల్లో రుణాలు ఇవ్వడం లేదని.. ప్రభుత్వం చొరవ తీసుకుని రుణాలు ఇప్పించాలనీ డైరెక్టర్లు కోరారు.

అన్ని కేంద్రాల్లో సన్నాలు కొనుగోలు చేయాలి

మండల పరిధిలో 34 పంచాయతీలుండగా గట్టేపల్లి, నాగారం గ్రామాల్లోనే సన్నవడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంపై డైరెక్టర్లు ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో సన్నాలు కొనుగోలు చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మాణించారు. ధారూరు మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంపై సభ్యులు మండిపడ్డారు. నాగారం, గురుదోట్ల, మోమిన్‌కలాన్‌, రాంపూర్‌తండాల్లో ధారూరు పీఏసీఎస్‌ ద్వారా, గట్టేపల్లి, తరిగోపుల గ్రామాల్లో హరిదాస్‌పల్లి పీఏసీఎస్‌ ద్వారా, నాగసమందర్‌లో ఐకేపీ ద్వారా వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చైర్మెన్‌ సత్యనారాయణరెడ్డి వివరించారు. పీఏసీఎస్‌ అత్యవసర సమావేశంలో సీఈఓ నర్సింహులు, డైరెక్టర్లు సుధాకర్‌గౌడ్‌, గోపాల్‌రెడ్డి, శివకుమార్‌, గోపాల్‌రెడ్డి, అబ్దుల్‌ కరీం, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధారూరు పీఏసీఎస్‌ చైర్మన్‌ సత్యనారాయణరెడ్డి

టీటీడీ సేవలు విస్తరించాలి


టీటీడీ చైర్మన్‌ బీఆర్‌ నాయిడును సన్మానిస్తున్న కృష్ణ ముదిరాజ్‌

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల్లో టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణ మండపాలు, ఆలయాలు నిర్మించాలని ముదిరాజ్‌ సంఘం చౌడాపూర్‌ మండల అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్‌ కోరారు. ఈ మేరకు సోమవారం నగరంలో టీటీడీ చైర్మన్‌ బీఆర్‌ నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. చౌడాపూర్‌, కుల్కచర్ల మండలాల్లో టీటీడీ కల్యాణ మండపాలు ఏర్పాటు చేయాలని విన్నవించారు.

‘డ్రగ్స్‌ రహిత సమాజాన్ని నిర్మిద్దాం’


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు అధికారులు

అనంతగిరి: జీవితంలో యవ్వనం చాలా ముఖ్యమైనదని అలాంటి యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా, వాటికి దూరంగా ఉండాలని వికారాబాద్‌ మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ చిగుళ్లపల్లి మంజుల రమేష్‌ సూచించారు. సోమవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో వికారాబాద్‌ మున్సిపల్‌ కార్యాలయంలో చైర్‌ పర్సన్‌ అధ్యక్షతన మాదకద్రవ్యాల నివారణపై వర్క్‌ షాప్‌ నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేసి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర యాంటీ నార్కోటిక్‌ బ్యూరో డీఎస్పీ పుష్పన్‌, కమిషనర్‌ జాకీర్‌ అహ్మద్‌, మెడికల్‌ ఆఫీసర్‌ నిఖిల్‌ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్స్‌ సమస్యలు పరిష్కరించండి

విద్యుత్‌ ఆర్టిజన్‌ కార్మికుల హెచ్‌–82 యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి


ఎస్‌ఈ కార్యాలయం ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్టిజన్‌ కార్మికులు

అనంతగిరి: ఆర్టిజన్స్‌ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విద్యుత్‌ ఆర్టిజన్‌ కార్మికుల హెచ్‌–82 యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం విద్యుత్‌ ఎస్‌ఈ కార్యాలయం ఏఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సబ్‌స్టేషన్‌లో ఇద్దరు మాత్రమే ఉన్న దగ్గర మూడో ఆపరేటర్‌ను నియమించాలని కోరారు. పోల్‌ టూ పోల్‌ ఆర్టిజన్స్‌ కార్మికుల పనిభారం తగ్గించాలన్నారు. సబ్‌ స్టేషన్స్‌లలో నీటి సదుపాయం కల్పించాలన్నారు. టీఎస్‌ఎస్‌పీడీసీఎల్‌ నుంచి టీజీఎస్‌పీడీసీఎల్‌ గా మారినందున ఆర్టిజన్స్‌ కార్మికులందరికి ఐడీ కార్డులు ఇప్పించాలన్నారు. యూనియన్‌ బ్యాంక్‌తో జరిగిన ఒప్పందాన్ని జిల్లాలో తొందరగా పూర్తి చేయాలన్నారు. పోల్‌ టూ పోల్‌ ఆర్టిజన్స్‌ కార్మికులకు టీఏ బిల్స్‌ ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుభాన్‌, వెంకట్‌, నర్సింలు, జాఫర్‌, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సోదరుల మధ్య ఘర్షణ

అవమానంతో ఆత్మహత్య చేసుకున్న అన్న

కుల్కచర్ల: సోదరుల మధ్య జరిగిన ఘర్షణ అన్న ఆత్మహత్యకు దారితీసింది. ఈ ఘటన ఆదివారం సాయంత్రం కుల్కచర్ల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కొమ్ము విష్ణు(43) తన తల్లితో గొడవపడుతుండగా ఆయన తమ్ములు మల్లేశ్‌, మదరయ్యలను అన్నను అడ్డుకున్నారు. దీన్ని అవమానంగా భావించిన విష్ణు ఒంటిపై పెట్రోల్‌ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను వెంటనే కుల్కచర్ల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ సిబ్బంది లేకపోవడంతో గండీడు నుంచి 108 వాహనం పిలిపించుకుని మహబూబ్‌నగర్‌ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి తమ్ములు ఘర్షణ పడడంతో అవమానంగా భావించి తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

పెండింగ్‌ వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహిపాల్‌, రామకృష్ణ


అడిషనల్‌ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

అనంతగిరి: అంగన్‌వాడీ టీచర్లకు పెండింగ్‌ వేతనాలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహిపాల్‌, రామకృష్ణ డిమాండ్‌ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ కార్యాలయంలో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేపట్టి అనంతరం అడిషనల్‌ కలెక్టర్‌ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మినీ అంగన్‌వాడీ సెంటర్‌లో వీరికి పూర్తి వేతనం చెల్లించే విధంగా ఆర్థిక శాఖ ట్రెజరీలో అప్‌డేట్‌ చేయాలన్నారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. పెరిగిన వేతనం మూడు నెలలు మాత్రమే ఇచ్చారన్నారు. మళ్లీ 5 నెలల నుంచి మినీ అంగన్‌వాడీ వేతనమే ఇస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకుని వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్‌ నాయకులు నర్సమ్మ, లక్ష్మీ, కవిత, సంగీత, విజయలక్ష్మి, భారతి, నిర్మల, మంజుల, స్వరూప, శ్వేత, కమలాదేవి, శాంతి, సునీత, రుకీబాయి, అనసుయ, భారతి తదితరులు పాల్గొన్నారు.